

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ

**సుర్మయీ  షాం, జి జిస్ తర్‌హా ఆయే,**

**సాస్ లేతీహై జిస్‌తర్హా సాయే!**

మన సినిమాల్లో ప్రేతాత్మలు, దయ్యాలు చాలా అందమైన గొంతుతో మనోహరమైన పాటలు పాడతాయి. దయ్యాల సినిమాలు అంటే భయంకరమైనవిగా ఉండాలి. కానీ మన దగ్గర ఆత్మలు 'లతా'గొంతుతో అత్యంత సుమధురమైన పాటలు పాడతాయి. మన దయ్యాలు కూడా మెలోడియస్ దయ్యాలు. ఆత్మ అంటే రూపంలేనిది. కానీ మన సినిమాల్లో చనిపోయిన వారి ఆత్మలు, శరీరం ఏ రూపంతో ఉండేదో అదే రూపంతో ఉంటాయి. స్కూలు పిల్లలు యూనిఫారం వేసుకున్నట్టు ఆడ దెయ్యాలయితే తెల్లటి బట్టలు ధరిస్తాయి. జుట్టు విరబోసుకుంటాయి. చాలా కవితాత్మకమయిన పాటలు పాడతాయి. దాంతో ఆత్మలు కాలి బూడిదయైనా శరీరంతో ఎలా కనిపిస్తాయన్న ప్రశ్న కలగదు. భౌతికమైన శబ్దాన్ని సృష్టిస్తూ ఎలా పాడుతోందన్న సందేహం రాదు. పైగా, ఆ పాటలకోసమే సినిమాను పదే పదే చూస్తూంటాం. అయితే 'లేకిన్' సినిమాలో 'గుల్జార్' చాలా అత్యద్భుతమైన రీతిలో ఇటు భౌతిక ప్రపంచానికి, అటు భౌతికాతీత ప్రపంచానికి చెందని స్థితిలో ఉన్నట్టు ఊహించే జీవితం, మరణాల పొలిమేరల్లో ఉండే ఆత్మలు, పిశాచాలు, దయ్యాలను అతిగొప్పగా, అతి సున్నితంగా, అత్యంత ఆలోచనాత్మకంగా వర్ణించాడు.

'లేకిన్' సినిమా నిర్మాణం వెనుక ఒక కథ ఉంది. 1980 – 90 వరకూ అప్రతిహతంగా సాగిన లతామంగేష్కర్ గానామృత వాహినికి అడ్డుకట్ట పడే పరిస్థితి నెలకొంది. అనురాధ పాడ్వాల్, టీ సిరీస్ అధినేత గుల్షన్ కుమార్‌తో కలసి లతకు పోటీగా నిలిచారు. ఒక పద్ధతి ప్రకారం లత ఆధిక్యాన్ని సవాల్ చేసింది అనురాధా పాడ్వాల్. ఆ సమయంలో పలు స్వరాలు రంగప్రవేశం చేసి సంచలనం సృష్టిస్తున్నాయి. లతతో అద్భుతాలు చేసిన శంకర్ జైకిషన్, ఎస్డీ బర్మన్, సి.రామచంద్ర వంటివారు లేరు. లతతో గొప్ప పాటలు పాడిన రఫీ, ముకేష్‌లులేరు. పాత నిర్మాతలు కనుమరుగయిపోయారు. కొత్త తరం తెరపైకి వస్తోంది. పైగా, అదంతా డిస్కో కాలం. దాంతో లత వెనుకపడినట్టు అనిపించింది. లత శకం అయిపోయిందన్నట్టు వ్యాఖ్యానాలు మొదలయ్యాయి. చివరికి లతకు విధేయులుగా పేరుపొందిన లక్ష్మీకాంత్ ప్యారేలాల్‌లు కూడా అనురాధా పాడ్వాల్, అల్కా యాగ్నిక్, కవిత కృష్ణమూర్తి వంటి యువగాయనిలవైపు దృష్టి మరల్చటం ఆరంభించారు. ఈ విషయమై వారిరువురి నడుమ విభేదాలు కూడా పొడచూపాయి. ఆర్డీబర్మన్ పరిస్థితి

అంతగా బాగోలేదు. ఉచ్చస్థాయిలో ఉన్న బప్పీలహరి సృజించే పాటలకు లత అంతగా అవసరం లేదు. ఇలాంటి పరిస్థితిలో తనని తాను నిరూపించుకోవాల్సిన అవసరం కలిగింది లతామంగేష్కర్‌కు. అయితే, యువగాయనిలందరి మీదా తన ఆధిక్యం నిరూపించుకునేందుకు లత తనకు మాత్రమే ప్రత్యేకమైన పద్ధతిని ఎంచుకుంది. తనకు మాత్రమే సాధ్యమైన పద్ధతి అది. ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం ఉన్న కళాకారులు మాత్రమే తమ ఆధిక్యం నిరూపించుకునేందుకు లత ఎంచుకున్న మార్గం ఎంచుకుంటారు. యువగాయనిలు, లేక సమకాలికులు ఎవ్వరూ తనలాగా పాడలేరని, వారు మొదటి మెట్టుపై ఉంటే తాను శిఖరంపైన ఉన్నానని నిరూపించుకునేందుకు లత ఎంచుకున్న ఆయుధం ఆమె స్వరం. ఆమె ఎంచుకున్న పద్ధతి 'గానం'.

ఆ సమయంలో ఉన్న వారందరిలోకీ అత్యంత సృజనాత్మక కళారుడు, లత స్వర మాధుర్యాన్ని, ఔన్నత్యాని అవగాహన చేసుకున్నవాడు అయిన గుల్జార్ దర్శకుడిగా, గేయ రచయితగా సంగీత భరితమయిన సినిమా 'లేకిన్'ను నిర్మించింది. ఆ సినిమాలో పాటల ద్వారా సమకాలీన గాయనిలందరిపై తన ఆధిక్యాన్ని నిరూపించుకుంది. మరో రెండు దశాబ్దాల పాటు తిరుగులేని గాయనిగా నిలిచింది. ఈలోగా గుల్షన్ కుమార్ మరణంతో అనురాధ పాడ్వాల్ పోటీలో లేకుండా పోయింది. అల్కయాగ్నిక్, కవిత కృష్ణమూర్తి, సునీధి చౌహాన్ వంటివారు లత ఆధిపత్యాన్ని సవాల్ చేయలేకపోయారు. లత స్వచ్ఛందంగా పాటలు తగ్గించుకునేంతవరకూ ఆమెనే అందరి నిర్మాతల ఛాయిస్. చివరికి కాజోల్‌కు 'దిల్ వాలే దుల్హనియా లేజాయేంగే'లో పాడి ఒప్పించింది లత. అప్పుడు లత వయసు 66. కాజోల్ వయసు ఇరవై ఒకటి.

లతా మంగేష్కర్‌కు ఖయ్యాం ఇష్టమైన సంగీతదర్శకుడు. కానీ 'ఉమ్రావ్ జాన్' సినిమాలో ఆశాభోంస్లేతో పాడించి జాతీయ అవార్డు స్థాయి సంగీతాన్ని కూర్చటంతో ఖయ్యాం జోలికి వెళ్ళలేదు లత. సోదరుడు హృదయనాథ్ మంగేష్కర్ ఆధారంగా 'ఉమ్రావొజాన్ 'ను మించిన అత్యద్భుతమైన శాస్త్రీయ సంగీత ఆధారిత గీతాలను పాడి తానూ జాతీయ స్థాయి అవార్డును సాధించింది. అంటే ఒక్క సినిమాతో అటు యువగాయనిలపైన, ఇటు సోదరి ఆశాభోంస్లే పైన విజయం సాధించి తన ఆధిక్యాన్ని నిరూపించుకున్నదన్నమాట లతా మంగేష్కర్.

'లేకిన్' కథకు ప్రేరణ రవీంద్రనాథ్ ఠాగోర్ కథ 'క్షుధిత పాషాన్' అంటారు . నాయకుడు, ఓ మహారాజు పాడుపడిన భవనంలోని వస్తువుల వివరాలు సేకరించేందుకు రాజస్థాన్ వెళ్తాడు. రాజస్థాన్ చేరినప్పటినుంచీ అతనికి ఓ యువతి కనిపించీ, కనిపించనట్టు కనిపిస్తూంటూంది. ఆ యువతి జీవితానికి, మరణానికి నడుమ ఘనీభవించిందని గ్రహిస్తాడు. ఆమె కథ తెలుసుకోవాలనుకుంటాడు. ఆ యువతి ఎవరో ఏమిటో తెలియక, ఆమె ఎలా వస్తోందో, పోతోందో అర్ధంకాక మరణానికి జీవనానికి నడుమ ఉన్న ఆ అస్పష్టలోకం గురించి ఆలోచిస్తూ ఓ సాయంత్రం తన మానసిక వేదనను, సందేహాలను, ఆందోళనలను పాట రూపంలో వ్యక్తపరుస్తాడు హీరో.

ఈ 'సుర్మయీ షాం' పాటను గుల్జార్ మహాద్భుతమైన రీతిలో రచిస్తాడు. ఒక ఆకారంలేని, భౌతిక, అభౌతిక ప్రపంచాల నడుమ కొట్టుమిట్టాడుతున్న జీవిని భౌతిక ప్రపంచంలో ఉన్న వ్యక్తి ఎలా దర్శిస్తాడో దాన్ని అత్యంత కవితాత్మకంగా ప్రదర్శిస్తాడు. గుల్జార్ abstract (అమూర్త) కవితలకు పెట్టింది పేరు. ఇక అమూర్తాన్ని వర్ణించటం అంటే గుల్జార్‌లోని అమూర్తకవి విజృంభించటంలో ఆశ్చర్యంలేదు.

'సుర్మయీ' అంటే అందమైన. సుర్మయీ అంటే నలుపు తెలుపుల నడుమ ఉన్న రంగు gray colour mixed with dark colour. అలాంటి సాయంత్రం ఎలా వచ్చిందంటే, ఒక నీడ ఊపిరి తీసుకున్నట్టు వచ్చిందట. ఇక్కడ ఆగిపోతాం. నీడ ఊపిరి తీసుకోవటం అంటే ఏమిటి? నీడ ఎలా ఏర్పడుతుందో తెలుసు. కాంతి పథంలో ఏదైనా అడ్డువచ్చినప్పుడు నీడ ఏర్పడుతుంది. అది వస్తువు నీడ. కానీ వస్తువుకాదు. నీడకు ప్రత్యేక అస్తిత్వంలేదు. కానీ అది కదులుతుంది. సజీవంగా ఉన్న మనిషి కదిలితే కదులుతుంది. అతడి ప్రతి కదలికను నీడ ప్రతిబింబిస్తుంది. అతడు ఊపిరి పీలిస్తే నీడ కూడా ఊపిరి పీలుస్తుంది. కానీ నిజంగా నీడ ఊపిరి పీలుస్తుందా? ఇలాంటి పలు విచిత్రమైన ఆలోచనలకు తావిస్తుంది నీడ. నీడ మనిషివల్ల ఏర్పడినా ఒకోసారి నీడ ఆకారం మనిషి ఆకారానికి భిన్నంగా ఉంటుంది. నీడలతో లేనివి ఉన్న భ్రమను సృష్టించవచ్చు. నీడ ఎలా ఊపిరి పీలుస్తుందో అలా వచ్చిందట ఆ అందమైన సాయంత్రం. సాయంత్రం ఎలా వస్తుంది? ఎవరూ గమనించలేరు. చూస్తూ చూస్తూ వాతావరణంలో మార్పు వస్తుంది. వెలుతురు తగ్గిపోతుంది. మధ్యాహ్నం సాయంత్రంగా రూపాంతరం చెందుతుంది. అలా వచ్చిందట సాయంత్రం. ఇది పాటలో చెప్పబోయే ఇతర విషయాలకు నాందీ ప్రస్తావనలాంటిది.

సినిమాలో ఇది గమ్మత్తయిన రొమాన్స్. ఆమెకు కాలంతో సంబంధం లేదు. వర్తమానం, భూతకాలాల నడుమ ఘనీభవించి దిక్కులేని స్థితిలో ఉందామె. ఇతడు వర్తమానంలో ఉన్నాడు. వీరిద్దరి ప్రేమ ఇది. అంటే, ఆమె ఇటు భౌతిక ప్రపంచానికీ, అటు శూన్యానికీ నడుమ తిరుగుతోంది. ఆమెని కలవటం, చూడటం ఇతడికి ఎంతగా అలవాటయిపోయిందంటే, ఆమె లేకపోవటం 'శూన్యం'లా అనిపిస్తోంది. ఆమె లేకపోతే తన ఆత్మ తనతో లేనట్టు భావిస్తున్నాడు. ఆమె కోసం వెతకటం అంటే తన ఆత్మకోసం వెతకటం. ఆమెను సాధించటం ఆత్మశాంతిని సాధించటం. దాంతో అతని హృదయం బరువెక్కింది.

పాటను రూపొందించిన విధానంలో ఈ సజీవం, జీవం నిర్జీవంల నడుమ ఉండటంలాంటి వైరుధ్యాలను, ప్రస్ఫుటం చేయటం కనిపిస్తుంది. పాటలో సంగీత వాయిద్యాలు గంభీరంగా ఉండి బరువైన భావనను కలిగిస్తాయి. హీరో హృదయ భారాన్ని ప్రతిబింబిస్తుంది సంగీతం. కానీ పాటలో పదాలు తేలికయినవి. దూదిపింజల్లాంటివి. అతని చుట్టూ ఉన్న వాతావరణం అలాంటిది. వీటికి సురేష్ వాడేకర్ స్వరం తోడయింది. సురేష్ వాడేకర్ ఎంతో మృదువుగా, పదం పలికితే అదృశ్యమైపోతుందన్నంత లాలిత్యంతో జాగ్రత్తగా పాడతాడు. దాంతో ఓ వైపు బరువుగా, మరోవైపు తేలికగా

అనిపిస్తుంది. రెండు విరుద్ధమైన భావనలు కలుగుతాయి. ఓ రకమైన అయోమయానికి మనస్సు గురవుతుంది. బాణీ బరువైనది. విషాదమైన గజల్ లాంటిది. గుల్జార్ పదాలు ఎలాంటి మెత్తనివి అంటే 'walking on eggshells' అన్న పదం ఆ మెత్తనితనాన్ని సరిగ్గా వర్ణిస్తుంది. కొంచెం గట్టిగా అడుగుపెడితే పగిలిపోతాయి.

ఒక్క అడుగు అటూ ఇటూ పడ్డా గుడ్డు పగిలిపోతుంది. చేతిలో గ్లాసు విరుగుతుంది అన్నట్టు పాడతాడు సురేష్ వాడేకర్. స్వరమండలం, జలతరంగిణి వంటివి పాటలో ఉన్న ప్రేమ భావనను తెలియచేస్తాయి. వయొలిన్లు, ట్రంపెట్లు దీనికి విరుద్ధమైన భావనను కలిగిస్తాయి. నాయిక ఒక భ్రమ. 'మరీచిక'లాంటిది. ఉన్నట్టు భ్రమ కలిగిస్తుంది. కానీ నిజంగాలేదు. తబలా, సితార్‌లు నాయకుడి మనస్సులోని ద్వైదీ భావనను శ్రోతకు తెలుపుతాయి.

**కోయీ ఆహట్ నహీ బదన్‌కి కహీన్**
**ఫిర్ భి లగ్తా హై తూ యహీన్ హై కహీన్**
**వక్త్ జాతా సునాయి దేతా హై**
**తేర సాయా దిఖాయి దేతా హై**
**జైసె ఖుష్బూ నజర్ సె ఛూ జాయే**
**సాస్ లేతా హై జిస్ తర్హా సాయే**

ఈ పాటలో పదాలు, వాటి భావం ఒక పరిచయంలేని భావనను మనస్సులో నిలుపుతాయి. కొన్ని అనుభవిస్తాం. కానీ ఆ అనుభవం 'ఇదీ' అని స్పష్టంగా పదాలతో చెప్పలేము. అలాంటి భావన ఇది. సాయంత్రం ఎంత నిశ్శబ్దంగా వస్తుందో, నీడ ఎలా ఊపిరి తీస్తుందో అలా వస్తుందామె. ఆమె వస్తున్న చప్పుడు ఉండదు. భౌతిక శరీరం ఉంటే కదా శబ్దం అయ్యేది. అందుకే చడీచప్పుడు లేకుండా, శరీరం లేనట్టుగా వస్తుందామె. ఏమీ శబ్దం కాకున్నా ఆమె ఇక్కడే ఎక్కడో ఉన్న భావన కలుగుతుంది. అంటే మనిషి ఉన్న సూచనలు లేవు. కానీ ఎవరో ఉన్న భావన కలుగుతోంది. కాలం కదలి వెళ్లిపోతున్న శబ్దం వినిపిస్తోంది. ఆమె నీడ కనిపిస్తోంది. అద్భుతమైన వాక్యాలివి. కదులుతున్న కాలాన్ని ఎవరు చూడగలరు? కాలాన్ని చూడలేము. భావించగలం మాత్రమే. కాలాన్ని చూడాలంటే భౌతిక ఇంద్రియాలు సరిపోవు. భౌతికతరాలను చూడగలిగే శక్తికల ఇంద్రియాలవసరము. సమయం కదలిపోతుందంటాము. కానీ సమయం కదలికను అనుభవించగలం తప్ప భౌతికంగా దర్శించలేము. ఇతడు సమయం వెళ్తున్న ధ్వనిని వినగలిగాడు. అంటే ఇతని ఇంద్రియాలు, ఇంద్రయాతీతమైన దాన్ని అనుభవించగలిగే స్థితికి చేరుకున్నాయన్నమాట. అప్పుడు ఆమె నీడ కనిపిస్తోంది. అందుకే ఆరంభంలో నీడ 'ఊపిరి పీలవటం' అన్నాడు. ఇప్పుడు ఆమె నీడ చూడాలంటే ఇతను వర్తమానకాలం నుంచి జీవ నిర్జీవాల నడుమ ఉన్న 'కాలం'లోకి అడుగుపెట్టాలి.

ఈ విశ్వంలో ప్రతి దానికీ నడుమ అటూ ఇటూ కాని స్థితి ఉంటుంది. భూమి చుట్టూ వాతావరణం ఉంటుంది , దాటితే అంతరిక్షం అంతా శూన్యం. ఈ వాతావరణం అదృశ్యమై శూన్యం అయ్యే నడుమ ఒక స్థితి ఉంటుంది. ఘన పదార్థం ఆవిరయ్యే నడుమ ద్రవ పదార్థం ఉంటుంది. ఇలాంటి intermediate state లో ఉన్నది నాయిక. ఆమెని చూడగలగాలంటే నాయకుడు ఆ స్థితిలో అడుగుపెట్టాలి. కానీ ఇతడి స్థితి వేరే. కాబట్టి ఆమె కనిపించీ కనిపించకుండా ఉంటోంది. ఉందో లేదో తెలియటంలేదు. అందుకే 'జైసె ఖుష్బూ నజర్ సే ఛూ జాయే ' అన్నాడు. అంటే ఒక పరిమళం కళ్లను స్పర్శించినట్టు ఆమె నీడను నీడ తీసుకునే ఊపిరిని చూసిన విధంగా చూస్తున్నాడన్నమాట. 'పరిమళాన్ని దర్శించటం'. పరిమళాన్ని తాకటం అన్న abstract thought గుల్జార్‌కు చాలా ఇష్టమైన భావన.

**హం నె దేఖీ హై ఉన్ ఆంఖోకి మహక్ తీ ఖుష్బూ**

**హాథ్ సే ఛూకె ఇసే రిష్తోంక ఇల్జాం న దో**

'ఖామోషీ' సినిమాలో ప్రేమ భావనను నిర్వచించేందుకు పరిమళాన్ని తాకటం అన్న abstract భావన వాడేడు. అతని కళ్లల్లోని పరిమళాన్ని చూసిందట ఆమె. చేతితో తాకి దానికి ఓ బంధనమన్న నేరాన్ని ఆపాదించకు అంటాడు ఆ పాటలో. అంటే, ప్రేమ భావన ఆత్మికమైన భావన. దాన్ని అనుభవించాలి తప్ప పదాల్లో చెప్పటం కుదరదు. వివరించటం కుదరదు. అందుకే దాన్ని భౌతిక ప్రపంచంలోకి తెచ్చి అమలినం చేయవద్దు అంటున్నాడీ పాటలో. భౌతిక ప్రపంచంలోకి తేవటం అంటే దాన్ని తాకటం, దానికి ఓ పేరునివ్వటం. భౌతిక ప్రపంచంలో నామరూపాలు లేందే దేన్నయినా గుర్తించటం కుదరదు. కానీ భౌతిక ప్రపంచంలోకి వస్తే అది అమలినం అవుతుంది. అపవిత్రం అవుతుంది. రెండు హృదయాల నడుమ భావన ఆ ఇద్దరికే పరిమితమైనంత వరకూ అది పవిత్రంగానే ఉంటుంది. మూడో వ్యక్తికి తెలిస్తే అది అక్రమము, అన్యాయము, అహస్యము అవుతుంది. దానికి ప్రేమ అని పేరు పెడతారు. ఏదో ఓ బంధనంలో బంధిస్తారు. దాని పని అయిపోతుంది. పరిమళం దుర్గంధం అవుతుంది.

'సుర్మయీ షాం' పాటలో కూడా ఈ పరిమళం కళ్ళని స్పృశించినట్టు ఆమెను చూస్తున్నాడన్నమాట హీరో. ఒక భావన. ఒక భ్రాంతి, ఒక భౌతికాతీతమైన అనుభవాన్ని ఇంతకన్నా సరళంగా, ఇంతకన్నా గొప్పగా వర్ణించటం కుదరదు.

ఇదే సినిమాలో యారా 'సిలీసిలీ' అనే మరో అద్భుతమైన పాటలో కూడా ఈ అభౌతికమైన భావనను చాలా గొప్ప రీతిలో వర్ణిస్తాడు గుల్జార్.

**టూ టీ హుయి చూడియోంసె జోడూ మై కలాయీరే**

**పిఛ లీ గలీమె జానె క్యా ఛోడ్ అయీ మై**

**బీతి హుహీ గలియోంసె ఫిర్ సే గుజర్‌నా**

ఆమె విరిగిన గాజులతో చేయిని అతికిస్తోందట. అర్ధమయీ అవనట్టూ, ఊహకందీ అందనటువంటి భావనలను ప్రదర్శిస్తూ శ్రోతలను 'టీజ్' చేయటం గుల్జార్‌కు వెన్నతో పెట్టిన విద్య. ఆమె మరణించింది. శరీరం లేదు. ఇప్పుడామెలేని శరీరాన్ని ఏర్పాటు చేసుకోవాలి. ఆమెకు గత జన్మ జ్ఞాపకం ఉండీ లేనట్టుంది. జ్ఞాపకం అన్నది భౌతికం కాదు. అందుకే 'గతం దారిలో ఏమి వదిలి వచ్చానో తెలియదు ' అంటోంది. దుష్ట రాజునుంచి తప్పించుకుని ఎడారి దాటి సోదరిని చేరాలని బయలుదేరి ఇసుక తుఫానులో చిక్కుకుని చచ్చిపోతుంది నాయిక. అక్కడక్కడే తిరుగుతోంది. అందుకే 'గతించిన దారుల్లోంచి మళ్ళీ ప్రయాణించాలి' అంటోంది. ఏదైనా కోరిక తీరక మరణించిన వారు కోరిక తీరేదాకా పిశాచ లోకంలో సంచరిస్తూంటారంటారు. అందుకే ఆమె మళ్ళీ ఆ దారుల్లో ప్రయాణించి ఆ కోరికను నెరవేర్చుకుంటే ముక్తిపొందుతుంది అన్నభావనను ఎంత గొప్ప రీతిలో వర్ణించాడో గుల్జార్. ఈ భావనలను అనుభవించటమే తప్ప అర్థం అయ్యేట్టు చెప్పటం కష్టం. ఇది సినిమా పాట, కవిత్వం కాదు అనటం కుదరదు. కవులు కూడా ఇంత చిక్కటి, లోతైన భావనలతో సంక్లిష్టమైన ప్రతీకలతో కవితలు రాయటంలేదు.

**పైరోంపే న సాయా కోయీ సర్ పే న సాయీ రే**
**మేరే సాథ్ జాయే న మేరీ పర్చాయీ రే**
**బాహర్ ఉజాలాహై, అందర్ వీరానా**

ఆమె కాళ్లకు నీడలేదు. ప్రేతాత్మల కాళ్ళు వంకరగా వుంటాయంటారు. ఇక నీడ ఏమివుంటుంది? ప్రేతాత్మ అన్న భావనను స్ఫురింప చేస్తున్నాడు గుల్జార్. ఆమె కాళ్లకు నీడ లేదు. తలకు రక్షణలేదు. ఆమె వెంట ఆమె నీడ, ప్రతిరూపం కూడా లేదు. భౌతికమైన శరీరం వుంటే నీడ వుంటుంది. శరీరమేలేని దానికి నీడ ఏమివుంటుంది? అందుకే, నా వెంట నా నీడకూడా రాదు అంటోంది.  బయట ఎంతో వెలుతురుంది. కానీ లోపల అంతా చీకటే. ఇదీ ప్రేతాత్మ స్వరూపం. పైకి భ్రమ కలిగించే రూపం కనిపిస్తోంది. కానీ నిజానికి ఏమీ లేదు. అంతా చీకటి. జీవం వెలుతురు. మరణం చీకటి. జననం కళ్లు తెరవటం. మరణిస్తే కళ్లు మూతపడటం. కళ్లు తెరచిన వాడు వెలుతురు చూడగలడు. కళ్లు మూస్తే చీకటే. ఆమె కన్ను మూసింది. కానీ కన్ను మూసినట్టు కాదు. అలాగని కన్ను తెరచినటు కాదు. అందుకే బయట వెలుతురు లోపల చీకటి. అలాంటామెను చూసిన హీరో తన భావనలను 'సుర్మయీ షాం' పాటలో వర్ణిస్తున్నాడు. యారా సీలీ సీలీ పాటను లతా పాడిన విధానాన్ని వర్ణించాలంటే భాష చాలదు. ఈ ఒక్క పాటలో చివరలో యారా అంటూ చేసిన ఆలాపన చాలు, మిగతాగాయనిలందరూ లతాకు పాదక్రాంతులయిపోయేందుకు. ఇక పాట మొత్తాన్ని వర్ణించాలంటే మరో వ్యాసం అవసరం.

**దిన్ క జోభీ పహర్ నికల్ తా హై'**
**కోయి ఎహెసాన్ సా ఉతర్ తా హై**

**వక్త్ కా పావ్ దేఖ్తా హూ మై**
**రోజ్ యే ఛావ్ దేఖ్ తా హుమై**
**ఆయే జైసే కొయీ ఖయాల్ ఆయే**
**సాన్స్ లేతీ హై జిస్ తర్హా సాయే..**

రోజులో ఏ ఘడియ గడిచినా ఏదో కృతజ్ఞతా భావన కలుగుతుంది. మనం బ్రతికి ఉన్న ప్రతిక్షణం కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఎప్పుడు మన సమయం అయిపోతుందో తెలియదు. అయితే హీరో ఊపిరి ఆగినా ఊపిరి తీస్తున్న ఆమెని చూశాడు. అతని ఊపిరి ఆడుతోంది. అందుకే ప్రతిఘడియ ఏదో కృతజ్ఞత బరువు పెరుగుతోంది అంటున్నాడు. అతడు కాలం కాళ్లు చూశాడు. అలాగే ఆమె నీడ చూస్తున్నాడు రోజూ. ఒక ఆలోచన ఎలా వస్తుందో ఆమె అలా వస్తుంది. సాయంత్రం అలా వస్తుంది. నిజం... ఒక ఆలోచన ఎలా వస్తుంది? ఎక్కడినుంచి వస్తుంది? ఈ ప్రక్రియ ఏమిటి? ఒక పదం ఎలా గుర్తుకు వస్తుంది? ఏదో అడగగానే సమాధానం కొన్నిటికి ఎందుకు స్ఫురిస్తుంది? మరి కొన్నింటికి ఎందుకు స్ఫురించదు? అలా ఆలోచన ఎలా వస్తుందో, ఎక్కడినుంచి వస్తోందో తెలియని విధంగా ఆమె కూడా వస్తుంది. పోతోంది. అంత ప్రాకృతం ఆమె రాకపోకలు. అంత రహస్యం, ఆమె రాకపోకలు. అంతా అగమ్యగోచరం ఆమె రావటం, పోవటం. పాట ముగింపులో వినిపించే జలతరంగ్, వైబ్రోఫోన్‌ల స్వరాలు ఒక అయోమయాన్ని, అర్ధమయీ అర్ధమవని భావాన్ని, తెలిసీ తెలియని ఆలోచనను కలిగిస్తాయి. ఇలాంటి పాట హిందీ సినీగీతాల ప్రపంచంలో ఇదొక్కటే. ఇలాంటి పాట రాయగలిగిందీ గుల్జార్ ఒక్కడే.

వచ్చే నెల మరికొన్ని పాటలతో...

Post your comments